నమస్తే తెలంగాణ
# నల్లగొండ
8 | నల్లగొండ, సోమవారం 17 ఫిబ్రవరి 2025 | NALGONDA

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు సిద్ధం
- పలు చోట్ల వృక్షార్చన కార్యక్రమాలు కేసీఆర్ మార్క్ ఉన్న ప్రతి చోట క్షీరాభిషేకాలు
- బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకల్లో భాగస్వామ్యం కావాలని నేతల పిలుపు



# అభిమాన నేతకు ఆత్మీయ వేడుక

## నేడు ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు ఏర్పాట్లు

సూర్యాపేట, ఫిబ్రవరి 16 (నమస్తేతెలంగాణ)/ నల్లగొండ : తెలంగాణ ఉద్యమ సారథి, స్వరాష్ట్ర సాధకుడు, అభివృద్ధి కాముకుడు, బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 71వ జన్మదిన వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు పుట్టిన రోజు వేడుకలను పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్ధం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రక్తదాన శిబిరాల ఏర్పాటు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయనున్నారు. ఇక కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన హరితహారానికి కొనసాగింపుగా పలుచోట్ల మొక్కలు నాటి వృక్షార్చనలో భాగస్వామ్యం అయ్యేందుకు సన్నద్ధమయ్యారు. కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, బడుగుల లింగయ్యయాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ హయాంలో కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలు, రెవెన్యూ డివిజన్లు, కలెక్టరేట్ల వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించాలని, కేసీఆర్ ఫ్లెక్సీలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలని కోరారు.

### యాదగిరి గుట్ట ఆలయం నుంచి యాదాద్రి థర్మల్ ప్లాంట్ వరకు..

- కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొననున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొననున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఇందులో భాగస్వామ్యం కానున్నారు. తొలుతగా ఉదయం ఏడు గంటలకు యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో జగదీశ్‌రెడ్డి పాల్గొంటారు. అనంతరం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన స్థానిక కార్యక్రమాలకు హాజరవుతారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు భువనగిరి పట్టణంలో కొత్తగా నిర్మించిన కలెక్టరేట్ ముందు భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నల్లగొండలో ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్మించిన మెడికల్ కళాశాల ముందు స్థానిక మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో, 11.30 నిమిషాలకు మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో యాదాద్రి థర్మల్ విద్యుత్ థర్మల్ కేంద్రం ముందు స్థానిక మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఏర్పాటు చేసిన వేడుకలకు హాజరవుతారు.

# వెలుగుల ప్రదాత కేసీఆర్

## అభివృద్ధి, సంక్షేమంలో అన్ని వర్గాలకు సమ న్యాయం

- పదేండ్ల పాలనలో ప్రతి మనిషికి ఏదో ఒక రూపంలో లబ్ధి
- కాళేశ్వరం, కృష్ణా జలాలతో కరువు జిల్లా సస్యశ్యామలం
- ధాన్యం దిగుబడిలో దేశంలోనే జిల్లాను నంబర్ వన్‌కు తీసుకొచ్చిన ఘనత
- ఫ్లోరైడ్ రక్కసి నుంచి రూపుమాపు
- ఆకలి చావులు, ఆత్మహత్యలు లేని తెలంగాణగా మార్పు



మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : 'దశాబ్దాల తరబడి వెనుకవేయబడడంతో మెజారిటీ ప్రజలు ఒక్కపూట భోజనం చేసి జీవించడానికి నానా అవస్థలు పడ్డ తెలంగాణ ప్రాంతానికి దేశంలోనే గుర్తింపు తెచ్చింది కేసీఆరే. వెలుగులు తెచ్చింది కేసీఆరే. పద్నాలుగేండ్లపాటు నిరంతరాయంగా శాంతియుత ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా ఉద్యమ సమయంలో రాష్ట్రం ఏర్పాటైతే ఒనగూరే లబ్ధిని విడమర్చి చెప్పేవారు. తెచ్చిన తెలంగాణ ఎలా ఉంటుంది? తమకు ఏం జరుగుతుంది? తెలంగాణ వస్తే నిజంగా అన్నీ వస్తాయా? అనే అనుమానాలను కేసీఆర్ పటాపంచలు చేస్తూ ఆకలి చావులు, ఆత్మహత్యల తెలంగాణను అన్నపూర్ణగా మార్చారు' అని తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నాటి ఉద్యమ సంఘటనలు, కేసీఆర్‌తో ఉన్న అనుబంధం, ఆయన మానవీయ కోణాలను గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, వ్యూహాలపై నమస్తే తెలంగాణతో ప్రత్యేకంగా తెలిపారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..

నాటి ఉద్యమ కాలంలో కేసీఆర్ ప్రతి నిత్యం మేధావులు, రాజకీయ నాయకులు ఇతరులతో దాదాపు 5 నుంచి 18 గంటలపాటు చర్చలు చేసేవారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎన్ని రకాలుగా ఆలోచన చేయాలో అన్నీ చేశారు. అన్ని వర్గాలను సమన్వయం చేస్తూ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఒప్పించి చివరకు కేసీఆర్ చచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో ఆమరణ దీక్షకు పూనుకున్నారు. నాటి కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది. తెచ్చిన తెలంగాణను ఉద్యమ సమయంలో చెప్పినట్లుగా, రాష్ట్రం వస్తే తమకు ఏదో లబ్ధి జరుగుతుంది అనుకున్నట్లుగా ప్రతి మనిషికి ఏదో ఒక రూపేన ఫలితాలను అందించారు. ఒకరికి వచ్చింది, మరొకరికి రాలేదన్నట్లుగా కాకుండా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పద్ధతిన అందించింది కేసీఆర్ పాలన.

### అత్యధిక లబ్ధి ఉమ్మడి నల్లగొండ జిల్లాకే..

తెలంగాణ రాష్ట్ర సాధనతో అత్యధిక లబ్ధి చేకూరింది ఉమ్మడి నల్లగొండ జిల్లాకే. ఈ జిల్లా అంటే కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం. ఐదు దశాబ్దాల పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాను పట్టి పీడించిన ఫ్లోరైడ్ రక్కసిని మిషన్ భగీరథ పథకంలో ఆరేండ్లలోనే నామరూపాల్లేకుండా పారదోలింది కేసీఆరే.

### ఆరేండ్లలోనే ఆకలి చావుల నుంచి అన్నపూర్ణగా..

తెలంగాణ రాష్ట్ర సాధనకు ముందు ఆకలి చావులు, ఆత్మహత్యల ప్రాంతంగా ఉండగా ఆ తర్వాత ఆరేండ్లలోనే అన్నపూర్ణగా మార్చడం అంటే కేసీఆర్ పరిపాలన దక్షతకు నిదర్శనం. రాష్ట్ర ఆవిర్భావం అయిన 2014లో 41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించగా 2020 నాటికే రాష్ట్రంలో మూడు కోట్లకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే స్థాయికి రావడం కేసీఆర్ గొప్పతనం. తెలంగాణ వేరైతే చీకట్లు కమ్ముకుంటాయి, ఊర్ల నుంచి రైతులు వలసలు పోవాల్సి వస్తదని, పోయిన రజాకార్లు తిరిగి వస్తారని సమైక్యవాదుల కుట్రలను పటాపంచలు చేశారు. రానేరాదన్న కరెంటును పోనే పోదన్న స్థితికి తీసుకువచ్చారు. మూడేండ్లలోనే కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో 24 గంటల విద్యుత్, రైతులకు 2017 నుంచి 2023 వరకు పూర్తిగా 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపారు.

ఉమ్మడి పాలనలో దేశంలోనే శాశ్వతమైన కరువు జిల్లాగా మారిన నల్లగొండను అన్నపూర్ణగా మార్చారు. ఐదు లక్షలకుపైగా బోరు బావులు ఉన్న రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్‌తో అత్యధిక లబ్ధి చేకూరింది. రైతుబంధు, రైతు బీమాతో ఎక్కువ లబ్ధి ఉమ్మడి నల్లగొండ రైతులు పొందారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలితం కూడా సూర్యాపేటకే దక్కింది. మరో వైపు నాగార్జునసాగర్ ఆయకట్టుకు గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ మన హక్కుగా నీటిని సాధించుకోగా ఇంకోవైపు మూసీని ఆధునీకరించడం ద్వారా జిల్లాలో మూడు నదులతో 10 లక్షలకు పైగా ఎకరాల భూమిని సాగులోకి తెచ్చుకున్నాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2014లో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా 2023 నాటికి 40 లక్షల టన్నులకు చేరుకుందంటే ఈ ఘనత కేసీఆర్‌ది కాకుండా మరెవరిది. దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి సాధించింది నల్లగొండ, ఇది కేసీఆర్‌కు నల్లగొండపై ఉన్న ప్రత్యేక దృష్టి. ఓ వైపు యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పునర్నిర్మించి, మరో వైపు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి అభివృద్ధి ఏంటో చూపించారు. ఉమ్మడి నల్లగొండను మూడు జిల్లాలు చేయడం ద్వారా ప్రజలకు పాలను చేరువ చేశారు. జిల్లాలో మెడికల్ కళాశాల తెచ్చి మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చారు.



2019 ఆగస్టు 17న యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ సీఎం కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత (ఫైల్)

# అపర యాద మహర్షి కేసీఆర్

- చరిత్రలో నిలిచేలా యాదగిరి గుట్ట ఆలయ పునర్నిర్మాణం

యాదగిరిగుట్ట : కఠోర తపస్సు చేసి నారసింహ స్వామి వారిని కొండపైకి తీసుకు వచ్చింది యాద మహర్షి అయితే.. ఆ స్వామివారి కొండను వెయ్యేండ్లు చెక్కు చెదరకుండా ఎంతో అద్భుతంగా పునర్నిర్మించిన రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ అపర యాద మహర్షిగా నిలిచిపోయారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కేసీఆర్ వెయ్యి రకాలుగా ఆలోచన చేసి రూ. 1,300 కోట్ల ప్రభుత్వ ఖజానాతో కళాత్మకంగా నిర్మాణం చేశారు. నిర్మాణంలో ఆలయం బాలపాదం నుంచి ఆలయ శిఖరం వరకు కృష్ణ శిలలు వాడి అబ్బురపడేలా చేశారు. 2016 అక్టోబర్ 12న ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించి ఆరేండ్లలో పూర్తి చేశారు. 2022 మార్చి 28న మహాకుంభ సంప్రోక్షణతో ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. గతంలో కంటే ఆలయం పునర్నిర్మాణం తర్వాత భక్తుల రద్దీతోపాటు ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది.

# సూర్యాపేట నుంచే పలు కార్యక్రమాలకు కేసీఆర్ శ్రీకారం

- 2002లో సాగర్ జలాల కోసం కోదాడలో పాదయాత్ర... 2006లో నాగారం నుంచి పల్లెబాట
- 2012 సమరభేరితో సంక్షేమ పథకాలకు నాంది
- డబుల్ బెడ్రూం ఇండ్ల శంకుస్థాపన ఇక్కడే

సూర్యాపేట, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ సమయంలోనైనా... తదనంతరం పదేండ్ల పాటు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట నుంచే పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు నీళ్ల కోసం 2002లో కోదాడ నుంచి నాగార్జున సాగర్ వరకు పాదయాత్ర చేపట్టారు. అలాగే తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కాలనే కుట్రలకు తెరలేపి బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను లాక్కున్న నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర కోరిక లేదంటుండగా 2006లో పల్లెబాట కార్యక్రమాన్ని కేసీఆర్ చేపట్టారు. అది ఉద్యమం నాటి నుంచి అత్యంత సన్నిహితంగా మెలిగి ఆసాంతం ఆయనతోనే పయనిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సొంత ఊరు అయిన నాగారం నుంచి మొదలు పెట్టారు. అనంతరం తెలంగాణ ప్రాంతంలో పర్యటించి ఉద్యమం లేదనేదానికి సమాధానం చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచిన విషయం విదితమే. కాగా జీవితకాలం మరచిపోలేని సదరు సంక్షేమ పథకాలను నాటి ఉద్యమ సమయంలో 2012లో సూర్యాపేటలో నిర్వహించిన తెలంగాణ సమర భేరి సభ సాక్షిగా ప్రకటించడం గమనార్హం. ప్రభుత్వం వైపు దీనంగా ఎదురు చూస్తున్న అభాగ్యులకు రూ.2వేల పింఛన్ ఇస్తానని సూర్యాపేట నుంచే ప్రకటించగా కొత్త జిల్లాల ఏర్పాటును సైతం సూర్యాపేట సమరభేరి నుంచే చెప్పారు. అంతే కాకుండా డబుల్ బెడ్రూం ఇండ్లు, సాగునీరు, 24 గంటల విద్యుత్ సరఫరా ఇలా గత బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఇచ్చిన అనేక సంక్షేమ పథకాలతోపాటు చేయబోయే అభివృద్ధిని సూర్యాపేట నుంచే ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలోనే మొదటగా సూర్యాపేట గొల్లబజారులో నాటి మంత్రి జగదీశ్‌రెడ్డి తలపెట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయానికి ముఖ్యమంత్రిగా కేసీఆర్ హాజరై శంకుస్థాపన చేశారు. సూర్యాపేటపై ఇంతటి అభిమానం చాటిన కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని నేడు పెద్ద ఎత్తున సంబురాలు చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తం అవుతున్నాయి.



2006లో నాగారంలో పల్లెబాట సందర్భంగా పర్యటిస్తున్న కేసీఆర్, పక్కన జగదీశ్‌రెడ్డి (ఫైల్)

# సాగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో మంటలు

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 16 : మండంలోని మూలతండా వద్ద గల నాగార్జున సాగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆదివారం మంటలు చెలరేగాయి. సుమారు 15ఎకరాల్లో అటవీ ప్రాంతం దగ్ధమైంది. మూల తండా అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించాయని స్థానికులు తెలుపడంతో ఫారెస్ట్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకోని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే సుమారు 15 ఎకరాల్లో చెట్లు పాక్షికంగా దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది



విద్యుద్దీపాల వెలుగులో జాతర ప్రాంగణం



కేసారంలో దేవరపెట్టెకు పూజలు చేసి పెద్దగట్టుకు తరలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, యాదవ పెద్దలు

# లింగా.. ఓ లింగా

## పెద్దగట్టుకు బారులు దీరిన జనం

- అర్ధరాత్రి తర్వాత మంద గంపల ప్రదక్షిణ.. మొక్కుల చెల్లింపు
- దేవరపెట్టెకు పూజలు చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల
- నేడు పాఠశాలలకు సెలవు

సూర్యాపేట టౌన్/చివ్వెంల : యాదవుల కుల దైవంగా పేరొందిన దురాజ్‌పల్లి లింగమంతుల జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. మధ్యాహ్నం నుంచే భక్తులు బారులుదీరి పెద్దగట్టుకు చేరుకున్నారు. మొన్నటి వరకు నిర్మానుష్యంగా ఉన్న ఈ ప్రాంతం జనసంద్రంగా మారింది. కాళ్ల గజ్జల సవ్వడులు, భేరీ చప్పుళ్ల మధ్య జనం తరలివస్తుండగా లింగా.. ఓ లింగా స్మరణలు మార్మోగుతున్నాయి. ఆదివారం రాత్రి కేసారం గ్రామం నుంచి దేవరపెట్టె, బోనం గంపను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పూజలు చేశారు. అనంతరం పూజారులు, యాదవ పెద్దలు సంప్రదాయ బద్ధంగా గుట్టపైకి తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దేవరపెట్టెలో ఉన్న దేవతామూర్తులను ఆలయంలో ప్రతిష్ఠించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. బోనాల గంపలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక రంగురంగుల విద్యుత్ దీపాలతో పెద్దగట్టు ఆలయం కళకళలాడుతున్నది. గట్టు ప్రాంతంలో వివిధ రకాల దుకాణాలు, ఎగ్జిబిషన్లు, జెయింట్ వీల్స్, సర్కస్‌లతో సందడి నెలకొంది. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాల అధికారులు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. జాతర సందర్భంగా సోమవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఆయా కలెక్టర్లు సెలవు ప్రకటించారు.



గంపలెత్తుకొని జాతరకు వెళ్తున్న భక్తులు

# గందరగోళంగా 'రైతు భరోసా'

- రైతుల ఖాతాల్లో అరకొర నిధుల జమ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

నూతనకల్, ఫిబ్రవరి 16: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం గందరగోళంగా మారుతున్నది. రైతుల ఖాతాల్లో అరకొర నిధులే జమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎకరాలకు రూ.6 వేలు, రెండెకరాలకు రూ.12 వేలు జమ కావాల్సి ఉండగా, కొంతమంది రైతులకు తక్కువ జమ అవుతున్నట్లు చెబుతున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులతో చెలగాటమాడుతున్నదని.. రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ హామీలే పూర్తిగా అమలు కాలేదంటే చివరకు రైతు భరోసా విషయంలోనూ మోసం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. సాంకేతిక తప్పిదాలను తెరపైకి తెచ్చి తమకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



1.37ఎకరాలు చూపిస్తున్న రైతు బత్తుల విజయ్‌కుమార్ పట్టాదారు పాసు పుస్తకం

### రూ.5,150 జమ చేశారు..



కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా సరిగా అమలు చేయడం లేదు. నాకు ఎకరం 37 గుంటల పట్టా భూమి ఉండగా పంటలు సాగు చేస్తున్నాను. ప్రభుత్వం ఇటీవల రెండెకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఆ లెక్కన నాకు దాదాపు రూ.11 వేల పై చిలుకు రావాల్సి ఉండగా రూ.5,150 మాత్రమే జమయ్యాయి. దీనిపై అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు.

*- బత్తుల విజయ్‌కుమార్, రైతు, చిల్పకుంట్ల*

# గ్లోబల్ ఎక్స్‌పోలో మెరిసిన పోచంపల్లి ఇక్కత్

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 16 : న్యూఢిల్లీలో నిర్వహించిన భారత్ టెక్స్ 2025 సందర్భంగా గ్లోబల్ టెక్స్‌టైల్ ఎక్స్‌పోలో చేనేత వస్త్రాల ప్రదర్శన అందరినీ అలరించింది. ఇందులో భూదాన్ పోచంపల్లి పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు బోగ బాలయ్య, అసిస్టెంట్ గంజి విజయ్‌కుమార్‌తో కలిసి మగ్గంపై తయారుచేసిన పది వేల రంగులతో కలిగిన జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ ఎక్స్‌పోలో పోచంపల్లి డబుల్ ఇక్కత్ గురించి వివరించేందుకు మగ్గం లైవ్ డెమోలో ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పోచంపల్లి డబుల్ ఇక్కత్ ప్రదర్శనకు తనకు అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందని బాలయ్య అన్నారు. ఎక్స్‌పో సందర్శించిన పలు దేశాల ప్రతినిధులు పోచంపల్లి డబుల్ ఇక్కత్‌కు ఖండాంతర ప్రాచుర్యం లభించిందన్నారు. చేనేత వస్త్రాలకు అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపు, ప్రాముఖ్యత, డిజైన్లు, నాణ్యతను తెలుసుకొని విదేశీయులు ప్రశంసించారు.



భారతదేశ పటంతో నేసిన డబుల్ ఇక్కత్ వస్త్రాన్ని ప్రదర్శిస్తున్న చేనేత కళాకారుడు బాలయ్య

వేలాది "పోలీసు & ప్రభుత్వ" ఉద్యోగాలు సాధింపచేసిన రీజనింగ్: నాగేశ్వర్ సార్, తెలంగాణ ఉద్యమ చరిత్ర ఫేం: లింగ స్వామి సార్ & ఆర్థమెటిక్: భరత్ సార్ ఆధ్వర్యంలో
SI-PC Groups | RRB VRO | స్పెషల్ బ్యాచ్ JLM | అడ్మిషన్లు ప్రారంభమైనవి
EM/TM న్యూ బ్యాచ్ తరగతులు ప్రారంభమైనవి Time 9.30 am 5.00 Pm
నేడే ఫ్రీ డెమో
SLICE2 కోచింగ్ సెంటర్ LPT మార్కెట్, నల్లగొండ
9491618604, 7989568604